# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

ఆంధ్రభూమి బ్యూరో

కరీంనగర్, ఏప్రిల్ 25: ప్రజావాణికి సంబంధించిన ఫిర్యాదులు, దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్మితా సబర్వాల్ అన్నారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి ప్రజావాణి దరఖాస్తులను కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో 5626 దరఖాస్తులు నమోదై ఉన్నాయని, వీటిలో గత వారం రోజులలో 1700 దరఖాస్తులు పరిష్కరించటం జరిగిందని, మిగిలిన దరఖాస్తులన్నింటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రతీ సోమవారం ప్రజలు సమర్పించే ఫిర్యాదులను, దరఖాస్తులను శాఖల వారీగా

## ◇ కలెక్టర్ స్మితా సబర్వాల్

అదే రోజు సాయంత్రం ఆన్‌లైన్ ద్వారా పంపించటం జరుగుతుందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అధికారులు పరిశీలించి 15 రోజుల్లోగా వాటిని పరిష్కరించాలని, దరఖాస్తు పరిష్కార స్థితిని తెలుపుతూ ఆన్‌లైన్‌లో నివేదించాలని సూచించారు. గత సోమవారం 44 ఫిర్యాదులు వచ్చాయని, అందులో ఇంతవరకు పది ఫిర్యాదులు పరిష్కారం అయినాయని, మిగిలిన 34 దరఖాస్తులను సంబంధిత అధికారులు అధిక ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రతి అధికారి పరిష్కారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని, నెల రోజుల వ్యవధిలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, దరఖాస్తులు అన్నీ పరిష్కారం కావాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులు పరిష్కారం విషయమై అప్‌డేషన్ చేసేందుకు శాఖల వారీగా ఇంచార్జిని నియమించి ఈ పని అప్పగించాలని పేర్కొన్నారు. ఫిర్యాదు పరిష్కారం కూడా పూర్తి స్థాయిలో న్యాయబద్ధంగా ఉండాలని, 77 శాఖలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఉంచటం జరుగుతుందని తెలిపారు. అడిషనల్ జాయింట్ కలెక్టర్ ఎస్.సుందర్ అబ్నార్, డిఆర్‌ఓ పిబి ఆర్.ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పవర్ పాయింట్ ద్వారా ఫిర్యాదులు, దరఖాస్తులు ఏ విధంగా పరిష్కరించాలి, ఏ రీతిలో ఆన్‌లైన్‌లో ఉంచాలనేది వివరించారు.



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్మితా సబర్వాల్



దరఖాస్తులు సమర్పించేందుకు కలెక్టర్ చాంబర్ ఎదుట కిక్కిరిసిన ప్రజలు